సుఫల
www.aksharamtelugudaily.com
# అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
అనుబంధ సంచిక
మంగళవారం 2, జూలై 2024 పేజీలు : 4

## సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**

**భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం /అక్షరం న్యూస్ :** ఆదివాసి గిరి జన గ్రామాలలో వర్షాలు పడు తున్నందున వాతావరణం మా ర్పు వలన గిరిజనులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి తగు జాగ్రత్తలు మిగతా2 లో..



## వ్యాధుల కాలం..

- పొంచివున్న సీజనల్ వ్యాధులు
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌కు అవకాశం
- పరిసరాల పరిశుభ్రతే ప్రధానమంటున్న వైద్యులు
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చు


# జర జాగ్రత్త!



వాతావరణంలో వస్తున్న మార్పులతో ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు ప్రారంభమయ్యాయి. ఉష్ణోగ్రతల్లో తేడాలతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. రోడ్లపైనే మురికి నీరు నిలబడడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామస్థాయి అధికారులు, వైద్యశాఖ సిబ్బంది ముందు నుండే జాగ్రత్త పడి జ్వరాలను నియంత్రించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధానంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాల కారణంగా వీధులు, రహదారులు, ఇళ్ల నడుమ మురుగు నీరు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది.

2లో..

● రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /(అక్షరం న్యూస్ )



## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం/ తల్లాడ (అక్షరంన్యూస్):** వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రఘునాధపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమీక్షలో మంత్రి రెవిన్యూ, విద్యుత్, వ్యవసాయం, విద్య, పంచాయతీ రాజ్, వైద్యం, ఇర్రిగేషన్, ఆర్ అండ్ బి, స్త్రీ-శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ, పశు సంవర్ధక, ఎక్సైజ్, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ధరణిలో 250 పెండింగ్ ఫైళు ఉన్నట్లు, వారంలోగా అన్ని ఫైళ్లను పరిష్కరించాలన్నారు. పోడు భూముల సమస్యలు రెవిన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. మండలంలో ఎన్ని ఇండ్ల పట్టాలు ఇచ్చినది, ఎంతమంది ఇండ్లు కట్టుకున్నది, ఎంతమంది ఇతరులకు అమ్మినది పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాల న్నారు. చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకో వాలని అన్నారు. విద్యుత్ కు సంబంధించి స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ అప్ మిగతా2 లో..

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్**



3లో..

**ఖమ్మం /తల్లాడ (అక్షరంన్యూస్):** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించి, సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు ఇస్తూ ఫార్వార్డ్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల నుండి బోడ సక్రియా, తనకు పుట్టకోట గ్రామంలో సర్వే నెం. 39 లో 12 కుంటల భూమి ఉన్నట్టు, పాస్ బుక్ ఇప్పించగలందులకు కోరగా, ఖమ్మం అర్బన్ తహశీల్దార్ ని అదనపు కలెక్టర్ చర్యలకై ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధ్యయనం..

- ఇతర రాష్ట్రాలకు బృందాలు..
- ఇందిరమ్మ ఇండ్లకు సోలార్ తప్పనిసరి..
- ఆవుటర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఇండ్ల నిర్మాణంపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలి...
- హౌజింగ్, రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్ అధికారుల సమీక్షలో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క
- బడ్జెట్ సమీక్ష సమావేశానికి హాజరైన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో



# వ్యాధుల కాలం జర జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

**సీజనల్ వ్యాధులు ఇవే..**

గ్రామాలలో డ్రైనేజి సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపైనే మురికినీరు నిలుస్తుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉంది. తలనొప్పి, గొంతునొప్పి, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, విషజ్వరాలు, డెంగ్యూ, బోదకాలు వంటివి ప్రబలే అవకాశాలున్నాయి.

**జ్వరం..**

మనిషి సాధారణ శరీర ఉష్ణోగ్రత 98.6 డిగ్రీలుగా ఉంటుంది. 100 డిగ్రీలు ఉంటే స్వల్పంగాను, 102 డిగ్రీలు లోపు ఉంటే సాధారణ జ్వరంగాను, 104 డిగ్రీలు దాటితే ప్రమాదకరమైన జ్వరంగాను పరిగణించాలి.

**డెంగ్యూ లక్షణాలు..**

మనిషికి 104 డిగ్రీలు జ్వరం వస్తే తలనొప్పి, కదుపునొప్పి, కీళ్ల నొప్పి, కండరాల నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. జ్వరం 105 డిగ్రీలకు చేరుకుంటే రోగి కోమాలోకి వెళ్ళిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**విష జ్వరాలు..**

ఒళ్ళు నొప్పులు, జలుబు, తుమ్ములతో జ్వరం వస్తుంది. వారం రోజుల పాటు జ్వరం తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. తలనొప్పి, చలి, నీరసం విష జ్వరాల ప్రధాన లక్షణం.

**మలేరియా..**

మలేరియా వ్యాధికి ముందు జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. సాయంత్రం కాగానే జ్వరం తగ్గుతుంది. విపరీతంగా చలి, వణుకు వస్తాయి. చేతులు, కాళ్ళు తిమ్మిర్లుగా ఉంటాయి. వాంతులు, విరేచనాలు అవుతూ ఆకలి సరిగా ఉండదు. మనిషి పూర్తిగా నీరసిస్తాడు.

**దోమలను అరికట్టే విధానం..**

ఇళ్ళలోని మంచినీటి తొట్లలో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈగలు, దోమ లు ముసరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో వేస్ట్ ఆయిల్ స్ప్రే చేయాలి. దోమ తెరలను తప్పని సరిగా ఉపయోగించాలి. గ్రామాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా, లార్వా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలి..**



రోగాలు వ్యాపించకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. కాచి వడపోసిన నీటిని తీసుకోవాలి. రోడ్డు పక్కన అమ్మే తినుబండారాలు తినకూడదు. రోజూ జ్వరం వచ్చి తగ్గుతుంటే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ చింతోజు శంకర్(పీపుల్స్ ఆసుపత్రి )

## సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ అధికారుల సమక్షంలో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాల కొరకు, పట్టా భూములకు రైతుబంధు రుణాల కొరకు, జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక వేసులుబాటు కల్పించుట కొరకు, ట్రైకార్ రుణాలు, గురుకులం కళాశాల పాఠశాలల్లో సీట్ల కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, వ్యవసాయ భూములకు కరెంటు బోరు మోటార్ ఇప్పించుట కొరకు, మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని ఆయన అన్నారు. దమ్మపేట మండలం బంజరు గ్రామానికి చెందిన వీరాస్వామి బోరు, మోటారు, కరెంటు సరఫరా ఇప్పించుట కొరకు, కరకగూడెం మండలం టేకియా తండా గ్రామానికి చెందిన హర్షిత గురుకులం పాఠశాలలో ఐదవ తరగతిలో సీటు ఇప్పించుట కొరకు, టేకులపల్లి మండలం బిల్లు తండా కి చెందిన అనుపమ ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు, టేకులపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన పద్మ మరియు గ్రామస్తులు పోడు భూముల సమస్యలు పరిష్కరించుట కొరకు, దుమ్ముగూడెం మండలం రామారావు పేటకు చెందిన సావిత్రి పై చదువులకు ఆర్థిక సహాయం కొరకు, చుంచుపల్లి మండలంకు చెందిన ఐలయ్య ట్రైకార్ రుణాల కొరకు, అసరాపేట మండలం కన్నాయి గూడెం గ్రామానికి చెందిన వేణు మరియు గ్రామస్తులు మంచినీరు, రోడ్డు, కరెంటు ఏర్పాట్ల కొరకు, చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామానికి చెందిన సతీష్ గురుకులం కళాశాల ఇంటర్మీడియట్ లో సీట్లు ఇప్పించుట కొరకు, దరఖాస్తులు చేసుకున్నారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఆర్.సి.ఓ గురుకులం వెంకటేశ్వరరాజు, ఎస్ డి సి రవీంద్రనాథ్, ఎస్ఓ సురేష్ బాబు, ఏపీ ఓ పవర్ మునీర్ పాషా, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ శ్రీనివాస్, ఉద్యానవనాధికారి అశోక్, ఎడి అగ్రికల్చర్ భాస్కర్, మేనేజర్ ఆదినారాయణ, డిఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, మరియు ఇతర విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధ్యయనం..

**ఖమ్మం/తల్లాడ ( అక్షరంన్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపించి అధ్యయనం చేయించి త్వరగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క హౌజింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి ఈ ఏడు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హౌజింగ్, రెవెన్యూ, ఐ అండ్ పిఆర్ శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ఇతర రాష్ట్రాల్లో పేదలకు అక్కడి ప్రభుత్వాలు నిర్మిస్తున్న ఇండ్ల నమూనాలు, లబ్ధిదారుల ఎంపిక విధానం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సూచించారు. కాలుష్యం లేనటువంటి గ్రీన్ ఎనర్జీని ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున ఇందిరమ్మ ఇండ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఇండ్ల నిర్మాణ సమయంలో కచ్చితంగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రాష్ట్ర రాజధాని హైదరబాద్ మహానగరం శర వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఔటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ ఇండ్ల నిర్మాణంపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాల్సిన బాధ్యత హౌజింగ్ శాఖపై ఉందని గుర్తు చేశారు. ఎస్ ఆర్ నగర్, బర్కత్‌పుర, కూకట్‌పల్లి, ఈసిఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి పేరిట ఇండ్ల నిర్మాణాలు చేయడం వల్ల ఎంతో మంది మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన హౌజింగ్ బోర్డు ఇండ్ల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ నుంచి భూమిని సేకరించుకోవాలని సూచించారు. ఇండ్ల నిర్మాణం చేయడానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇండ్లు నిర్మాణం చేయడానికి కావాల్సిన భూమి కొరకు హౌజింగ్ శాఖ నుంచి రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం హౌజింగ్ శాఖ అధికారులు మూడు బృందాలుగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలో చెన్నై, కర్ణాటకలో బెంగళూర్, మహారాష్ట్రలో ముంబాయి నగరాలకు హౌజింగ్ శాఖ అధికారులు వెళ్లి ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారులు ఎంపిక, లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హత తదితర విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేసి వచ్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని డిప్యూటి సీఎంకు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాల గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు నిర్మాణమైన ఇండ్లు, ఇంకా పూర్తి కావాల్సిన ఇండ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసి పరిధిలో గత ప్రభుత్వం లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకొని 69 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసి 65 వేల ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిందని అధికారులు వివరించారు. మిగత ఇండ్ల నిర్మాణం ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల గురించి ఆరా తీశారు. డిజిటల్ భూ సర్వే చేయడానికి నిధులను ఇవ్వాలని అధికారులు డిప్యూటీ సీఎంను కోరారు. సంపద సృష్టించి ఆ సంపదను ఈ రాష్ట్ర ప్రజలకు పంచడమే ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, ఈ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు ప్రత్యామ్నాయ వనరులను సమీకరించడంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, తదితరులు

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రేడ్ చర్యలు చేపట్టి, విద్యుత్ సరఫరా నాణ్యతతో చేయాలన్నారు. మండలంలో అవసరమైన బిటి రోడ్లు, ప్రస్తుత మున్న బిటి రోడ్ల రేనివల్ పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్ని డొంక రోడ్లు అడుగుతున్నారు, నిర్మాణానికి ఎంత ఖర్చు వివరాలు సమర్పించాలన్నారు. గ్రామాలను పరిశు భ్రంగా ఉంచాలన్నారు. మొక్కలు నాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, విస్తరణ తొలగించాల్సి రావడం, విద్యుత్ తీగల క్రింద నాటడం, తొలగించాల్సిన పరిస్థితిని నివారించాలన్నారు. మండలంలో విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా వున్నట్లు, లాభదాయక వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వెదజల్లే పద్ధతిని రైతులు పాటించేలా చూడాలన్నారు. పామాయిల్ పెంపకాన్ని ప్రోత్సహించాలని, మొక్కలు వేసుకున్న వారికి సబ్సిడీ వెంటనే అందజేయాలని అన్నారు. కూరగాయలు పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. కూరగాయల మార్కెటింగ్ కు ఏసీ వాహనాలు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో రూ. 55 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. మండలంలో 51 పాఠశాలలు ఉన్నట్లు, 3101 మంది విద్యార్థులు ఉండగా, పాఠ్యపుస్తకాలు, ఒక జత యూనిఫామ్ అందజేసినట్లు తెలిపారు. మరో యూనిఫామ్ జత త్వరితగతిన అందజేయాలన్నారు. స్వంత అంగన్వాడీలకు భవనాల నిర్మాణం కొరకు స్థల కేటాయింపు చేయాలన్నారు. అన్ని అంగన్వాడీలకు మిషన్ భగీరథ నీరు, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు, దీనిపై నఠనివేదిక సమర్పించాలన్నారు. 4 లేన్ల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, మీడియన్లలో ప్లాంటేషన్ చేయాలని అన్నారు. అన్ని గ్రామాల్లోని ఓహెచ్ఎస్ఆర్ లకు మిషన్ భగీరథ నీటి సరఫరా అందేలా చూడాలని, క్లోరినేషన్ ప్రక్రియ క్రమం తప్పకుండా చేయాలని ఆయన తెలిపారు. స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ నిర్మాణంలో వేగం పెంచాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పశువులకు వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలని, పశువైద్యులు అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. గొర్రెల అభివృద్ధి పథకం క్రింద ఎన్ని యూనిట్లు ఇచ్చినది, ఆ యూనిట్లతో గొర్రెలు ఎంత పెరిగింది నివేదిక సమర్పించాలన్నారు. శాఖలు చేపట్టుతున్న పనులు, పనుల పురోగతి, ఎంతకాలంలో పనులు పూర్తవ్వేది సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో రఘునాథపాలెం ఎంపిపి భూక్యా గౌరి, జెడ్పిటిసి మాలోతు ప్రియాంక, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఎఫ్ఆర్ఓ రాధిక, సిడిపిఓ కవిత, వైద్యాధికారి డా. బాలకృష్ణ, ఐటిడిఏ డిఇ రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్ రిమాండ్

**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూలై 01/ అక్షరం న్యూస్ :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కలకలం రేపిన వ్యక్తి హత్య కేసు మిస్టరీ చిక్కుముడి విప్పారు. హత్య కారణమైన ఓ యువతి, యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ఫోటా బజార్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హిదాయత్ అలీ (31) సివిల్ ఇంజనీర్. దుబాయ్‌లో ఉంటూ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కాగా హిదాయత్ అలీకి అదే ప్రాంతానికి చెందిన సీమాబేగం(24) తో గతంలో అక్రమ సంబంధం ఏర్పడింది. హిదాయత్ అలీ దుబాయ్‌లో ఉండటంతో సీమా బేగం నగరంలోని ఫలక్‌నుమా తీగలకుంట ప్రాంతానికి చెందిన సయ్యద్ అమీర్(29)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో గత నెల దుబాయ్ నుంచి హిదాయత్ అలీ నగరానికి వచ్చాడు. ఈ క్రమంలో దుబాయ్ ఇంజనీర్ హిదాయత్ ఆలీ సీమాబేగాన్ని కలువాలంటూ కోరాడు. దీంతో ఈ విషయాన్ని సీమాబేగం అమీర్‌కు తెలియజేసింది. దీంతో కలువడానికి రమ్మని అమీర్ సీమాతో చెప్పాడు. పిలిచాక చంపేదామని పథకం పన్నారు. ఆ ప్రకారమే గత నెల 29 వ తేదీన హిదాయత్ అలీ తన క్వాలిస్ వాహనం (ఏపీ27ఏడబ్ల్యూ 2772) లో వచ్చి తనతో పాటు సీమాబేగాన్ని తీసుకెళ్లాడు. నార్సింగి మంచిరేవుల గ్రీన్‌ల్యాండ్ వద్దకు వెళ్లారు. వెనుక బైక్‌పై వచ్చిన అమీర్ హిదాయత్ అలీతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అమీర్ తనతో తెచ్చుకున్న కత్తితో హిదాయత్ అలీ విచక్షణ రహితంగా పొడిచి హత్య చేశాడు. తరువాత అక్కడి నుంచి సీమాబేగం, అమీర్‌లు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా ఇద్దరు నిందితులని తేలింది. ఈ మేరకు ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## నార్సింగి మున్సిపాలిటీలో స్మశానవాటికల అభివృద్ధికి కృషి

- మైలారం నాగపూర్ణ శ్రీనివాస్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 01/ అక్షరం న్యూస్ :** నార్సింగి మున్సిపాలిటీ లో స్మశానవాటికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మంచిరేవుల వీరశైవలింగాయత్ స్మశానవాటికలో బోర్ పనులను మున్సిపల్ చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉన్న స్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని పని చేస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సత్వర పరిష్కారానికి సిద్ధంగా ఉంటామన్నారు. మున్సిపాలిటీలో ఉన్న స్మశానవాటికల్లో నెలకొన్న సమస్యలను సైతం పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ లంకల పద్మ వీర రెడ్డి, కోటిగారి ఉషారాణి, డిఈ నరసింహ రాజు, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్, అరుణ్, మాజీ వార్డు సభ్యులు దామోదర్ రెడ్డి, స్థానికులు విశ్వనాథ్, వినోద్, బబ్లు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో నిర్మాణాలు తగవు

- సంజీవరెడ్డి



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 01/ అక్షరం న్యూస్ :** నాక్షబాటతో పాటు కోర్టు పరిధిలో వున్నా స్థలంలో రోడ్డును ఓ రియాల్టర్ దర్జాగా కబ్జా చేస్తూ ప్రహరిని నిర్మిస్తున్నాడని స్థల యజమాని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లంకల సంజీవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో వివాదం ఉన్న పట్టించుకోకుండా నిర్మాణాలను ప్రారంభించడం ఏమిటని ఆయన మండిపడ్డారు. కిస్మత్పూర్ లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గండిపేట్ మండల కిస్మత్పూర్ లో అశోక బిల్డర్స్, లీగ్ బిల్డర్స్ సంస్థలు విల్లాల నిర్మాణాలను ప్రారంభించాయన్నారు. రియాల్డర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ పనులను చేపడుతున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 6 జెసిబిలతో పాటు ట్రాక్టర్ల తో వచ్చిన వందలాదిమంది కార్మికులు గ్రామం గుండా తమ పొలంలోకి వెళ్లే నక్షబాటను కబ్జా చేస్తూ నిర్మాణాలను ప్రారంభించాడని ఆరోపించారు. అందరూ నడిచే రోడ్డు అయినప్పటికీ రియాల్టర్ ఇదేది పట్టించుకోకుండా భారీ షెడ్లను వేస్తూ నిర్మాణాలను చేపడుతున్నాడని సంజీవరెడ్డి వెల్లడించారు. దీంతోపాటు సర్వేనెంబర్ 15, 16, 17,20 22, 23 లోని 14 ఎకరాల 14 స్థలా విషయమై కోర్టులో వివాదం నడుస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లా 5వ 11వ అడిషనల్ డిస్టిక్ కోర్టుతో పాటు ప్రిన్సిపల్ అడిషనల్ కోర్టులో ఓ ఎస్ నెంబర్ 664/23, 886/23, 78/24, 364/24 అయినప్పటికీ రియాల్టర్ కోర్టు ఉత్తర్వులను సైతం పట్టించుకోకుండా పనులను నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బడా రియాల్టర్ మూసి పరివాహక ప్రాంతాన్ని కబ్జా చేయడంతో పాటు బఫర్ జోన్ లో విల్లాలను నిర్మించాడని స్థానికులు గతంలో అనేక ఫిర్యాదులు చేశారని గుర్తు చేశారు. పత్రికల్లో సైతం కథనాలు వచ్చాయని వెల్లడించారు. కానీ ఇరిగేషన్ తోపాటు మూసి డెవలప్మెంట్ అథారిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మూసి అథారిటీ, ఇరిగేషన్, రెవిన్యూ, బండ్లగూడ కార్పొరేషన్ అధికారులు ఈ విషయంలో వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణ పనులను వెంటనే ఆపివేసి నాక్షబాటాను పునరుద్ధరించాలని కోరారు.

# పదవులు కాదు...చేసిన పనులే శాశ్వతం





**- ఐదేళ్లలో ఆదర్శ పాలన**
**- ఎంపీపీ జనగామ శరత్ రావు**

**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -01(అక్షరం న్యూస్ ):** పదవులు శాశ్వతం కాదని అవి లేకున్నా ప్రజాసేవలో ఉండాలని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవడమే గొప్ప విషయమనిఎంపీపీ జనగామ శరత్ రావు అన్నారు ముస్తాబాద్ మండల కేంద్రంలో తన కార్యాలయంలో జులై 4న పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో ఎంపీటీసీలతో కలిసి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లపాటు ముస్తాబాద్ మండలం ఎంపీపీ గా పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది.అని గ్రామాలలో మా హయాంలో అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు . కేటీఆర్ సర్కారు అందించిన ప్రోత్సాహంతో పాలనా అద్భుతంగా వసతులు కల్పించగలిగాంఅన్నారు .. దీనికి కృషి చేసిన అధికారులకు ఎంపీటీసీ సభ్యులు, ప్రజలకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటమన్నారు. గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ. అన్నారు2020 జూన్‌లో గంభీరావుపేటకు వచ్చిన సందర్భంగా మంత్రి కేటీఆర్ ఏడాది లోగా మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంకల్పసిద్ధితో ముందుకెళ్లి అనుకున్నది సాధించారనిఅన్నారు . కాళేశ్వరం 9వ ప్యాకేజీతో సంబంధం లేకుండా 12 ప్యాకేజీ ద్వారా మల్లన్న సాగర్ నుంచి ఎగువ మానేరుకు గోదావరి జలాలను తీసుకురావాలని సంకల్పించారని తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కెసిఆర్ సహకార ము తో మల్లన్న సాగర్ కాలువ ప్యాకేజీ 12ద్వారా మండుడెంటల్లో కూడా మత్తడి దూకింది అని ఇది శాశ్వతంగా గుర్తుండే పనిని ఈ కాలువ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 20వేల ఎకరాలకు సాగునీరు అందించిందని పేర్కొన్నారు మల్లన్న సాగర్ కాలువ మా హయాంలో కావడం ఎప్పుడూ మర్చిపోలేము అని అన్నారు.పార్టీ లు వేరైనా ఒక కుటుంబం కలసికట్టుగా పనిచేసి. అభివృద్ధి కోసం వచ్చిన నిధులు అందరికి ఇచ్చి మండల అభివృద్ధి కి తోడ్పాడ్డరాని .ఎంపీటీసీ గా నేరుగా నిధులు రాకున్నా ప్రభుత్వం ఇచ్చిన నిధుల తో గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు మండలం లోని ఐదేళ్ళ పరిపాలన కాలంలో అభివృద్ధి చేశామని, ఈ అభివృద్ధి కోసం అవకాశం ఇచ్చిన ప్రజలకు, ఎంపీటీసీ లకు, కెసిఆర్, కేటీఆర్ లకు ధన్యవాదాలు తెలిపారు ఎన్నికల వరకే పార్టీలు అని,ఐదు సంవత్సరాలు అభివృద్ధి పై దృష్టిపెట్టాలని అన్నారురాబోయే రోజుల్లోమీ ఆశీస్సులు ఉంటే మరింత పనులు చేయడానికి ముందు ఉంటా అని పేర్కొన్నారు అనంతరం మండల కో ఆప్షన్ షాదుల్ పాప, పాత్రికేయులు ఎంపీపీ జనగామ శరత్ రావు ను, రాష్ట్ర రజక సంఘము అధ్యక్షులు అక్కరాజు శ్రీనివాస్ ల ను శాలువా తో సత్కరించారు ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, పాత్రికేయులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ పంప్‌ను ప్రారంభించిన తాళ్ళపల్లి సంపత్ గౌడ్

**కరీంనగర్, తిమ్మాపూర్ జులై 01 (అక్షరం న్యూస్):** మానకొండూర్ మండలం గంగిపల్లిలోని ధనలక్ష్మి ధాన్య విత్తన సహకార పరపతి సంఘం ఆద్వర్యములో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సంపత్ గౌడ్ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు, వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడంలో సొసైటీలు ఉపయోగపడతాయని, రైతులు వాహనదారులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.సొసైటీ చైర్మెన్ పారువెల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామ పరిసర ప్రాంతాల వారికి కొంత ఆర్థికభారం తగ్గుతున్నది. గతంలో రైతులు పొలాలు దున్నేటప్పుడు దూరప్రాంతాలకు వెళ్లి పెట్రోల్, డీజిల్ తెచ్చుకునే బాధ తప్పడంతో పాటు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ప్రజలకు అందించేందుకు బంకును ఏర్పాటు చేశామని, బంక్ అభివృద్ధి చెందే విధంగా సొసైటీ పరిధిలోని గ్రామాల ప్రజలు రైతులు



పూర్తి సహకారం అందించాలని కోరారు. సోసైటీ చైర్మన్ పారువెల్లి శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ డివిజనల్ డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ రోషన్ సవాయి, వరంగల్ డివిజన్ సీనియర్ మేనేజర్ నరేష్ సేల్స్ మేనేజర్ షఫీక్, ధనలక్ష్మీ సహకార సంఘ సభ్యులు స్థానిక బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీల ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



**(మొదటి పేజీ తరువాయి)**

పెనుబల్లి మండలం చౌడవరం నుండి గుర్రం వెంకటేశ్వర రావు, తనకు వినికిడి లోపం ఉన్నట్లు, ఆసరా పెన్షన్ మంజూరుకు కోరగా, డిఆర్డీవో ని పరిశీలించి, తగుచర్యకై ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు హార్వెస్ట్ స్కూల్ యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వలేదని, విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపగా, జిల్లా విద్యాధికారిని తగుచర్యకై ఆదేశించారు. కారేపల్లి గ్రామం, సింగరేణి మండలం నుండి అలగడి పద్మ, తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమి కబ్జాకు గురయినట్లు, తిరిగి తమకు ఇప్పించగలందులకు కోరగా, ఆర్డీవోను విచారించి, తగుచర్యలు తీసుకోవాల్సిందిగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. స్థానిక బ్యాంకు కాలని, ఖానాపురం హవెలి నుండి సామినేని వెంకటేశ్వర్లు, తన కుమార్తె కు ఆధార్ కార్డ్ కొరకు అప్లై చేసినట్లు, ఆధార్ అప్రూవ్ కానట్లు తెలుపగా, తహశీల్దార్ ను తగుచర్యకై ఆదేశించారు. ఖమ్మం నుండి ముదిగుండ్ల నాగ అనిల్ కుమార్, తాను మూగ, చెవిటి వాడినని, డిగ్రీ చదివానని, ఉపాధి కోసం ఉద్యోగం ఇప్పించాలని కోరగా, జిల్లా ఉపాధి కల్పన అధికారిని తగుచర్యకై అదనపు కలెక్టర్ ఆదేశించారు. వైరా, హనుమాన్ బజార్ నుండి డి. నరసింహా రావు, తన కుమారునికి బిసి సంక్షేమ హాస్టల్ లో సీటు కొరకు కోరగా, జిల్లా బిసి సంక్షేమ అధికారిణిని తగుచర్యకై ఆదేశించారు. సింగరేణి మండలం, గ్రామం నుండి కొమ్ము ఉపేంద్రయ్య, తనకు 2020-21లో ఎస్సి యాక్షన్ ప్లాన్ క్రింద మంజూరయిన ఋణానికి సబ్సిడీ విడుదలకు కొరగా, ఇడి ఎస్సి కార్పొరేషన్ కి తగుచర్యకై ఆదేశించారు. ఖమ్మం నుండి డి. సంధ్య డబుల్ బెడ్ రూం మంజూరుకు కోరగా, తహశీల్దార్ కి తగుచర్యకై అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన





- జాబ్ మేళాలో సుమారు60 ప్రైవేట్ కంపనీలు పాల్గొనగా 603 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి
- జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే : కూనంనేని సాంబశివరావు
- ఉద్యోగం పొందిన యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి జిల్లా కలెక్టర్: జితేష్ వి పాటిల్

**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జులై.01/ అక్షరం న్యూస్:** జిల్లా యువజన మరియు క్రీడల శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యం కొత్తగూడెం క్లబ్ లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. తెలంగాణా సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్( టిజి.స్టెప్ సికింద్రాబాద్) మరియు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యం, కొత్తగూడెం క్లబ్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించటం కొరకు జులై.01న నిర్వహించిన జాబ్ మేళాలో ఎస్సెస్సి, ఇంటర్ మీడియట్, డిప్లొమా, బి.ఇ, డిగ్రీ, బిటెక్, ఎంటెక్, ఎంబిఏ, ఎంసీఏ, ఎంసియస్, బీఫార్మసి, ఎంఫార్మసి మరియు హొటల్ మేనేజ్ మెంట్, కోర్సులలో చదివి నిరుద్యోగులైన వారు ఈ జాబ్ మేళా లో 2450 రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు అయ్యారు. ఈ జాబ్ మేళాలో సుమారుగా (60) ప్రముఖ ప్రైవేట్ కంపనీలలో (603) మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగినది. 928 మందికి తదుపరి ఇంటర్వ్యూ కి ఎంపిక చేయగా మొత్తంగా 1531 మందిని ఈ జాబ్ మేళాలో ఎంపిక చేయటం జరిగింది. జాబ్ మేళా ను కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు , జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అందరు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే ఉద్యోగం అవకాశం పొందిన యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాపు సీతామాలక్ష్మి , మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత ,జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కే. సంజీవరావు, సూపరింటెండెంట్ ఆర్.ఉదయ్ కుమార్ సిబ్బంది తిరుమల రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## బైండోవర్ ఉల్లంఘనకు జరిమాన



**హనుమకొండ/భీమదేవరపల్లి/జూలై 01(అక్షరం న్యూస్):** గత నెల 24 న నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తున్న నలుగురు మహిళలకు రూ.1లక్ష 80 వేల జరిమానా విధించగా మరో మహిళ సరోజన పరారీలో ఉండటంతో సోమవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ చంద్రమోహన్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని వడ్డెర కాలనీలో గత రెండు వారాల క్రితం నాటు సారా కాస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీ సామాగ్రి స్వాధీనం చేసుకుని లక్ష్మీ, స్వరూప, రేణుక, కొమురమ్మలను పట్టుకుని కేసు నమోదు చేసారు. పరారీలో ఉన్న మహిళ వల్లెపు సరోజన ను భీమదేవరపల్లి డిప్యూటీ తహసీల్దార్ దరావత్ సూర్య ఎదుట బైండోవర్ చేసి రూ. 45 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై మమత, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీనివాస్





**ఖమ్మం/తల్లాడ జూలై 1 (అక్షరంన్యూస్):** ఖమ్మం వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుని పదవి కోసం ఎన్నికలు జరిగాయి అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీలో ఉండగామొత్తం పోలైన ఓట్లు 2264 గుమ్మడవెల్లి శ్రీనివాస్ 241 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి వీరవెల్లి రాజేష్ మీద విజయం సాధించడం జరిగింది . గుమ్మడవెల్లి శ్రీనివాస్ కి 1075 ఓట్లు పోలవగా వీరవిల్లి రాజేష్ కి 834 , పెనుగొండ ఉపేందర్ రావు కి 344 , చెల్లని ఓట్లు 11 . ఖమ్మం నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న కూడా 2264 మంది హాజరై తమ ఓటు హక్కును వినియోగించు కోవడం పట్ల గుమ్మడవెల్లి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విజయవంతనం విజయం అనంతరం గుమ్మడవెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తన గెలుపు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ తనకు ఓటు వేసి గెలిపించిన ఆర్యవైశ్య సోదర సోదరీమణులకు మరియు ఓటింగ్ లో పాల్గొన్న ప్రతి ఒక్క ఆర్యవైశ్య సోదరీ సోదరీమణులకు కృతజ్ఞతలు తెలిపారు . రాబోయే రెండు సంవత్సరాల పదవి కాలంలో ఇంతకు ముందు కార్యవర్గం సేవా కార్యక్రమాలు అన్నింటినీ తప్పకుండా జరిగేటట్లు చూస్తానని అవే కాక ఇంకా ఆర్యవైశ్య సోదరులు ఏమైనా సమస్యలు ఉండి మా దృష్టికి తీసుకువస్తే మా పరిధిలో తగు సహాయం అందజేస్తామని అన్నారు . ఎన్నికలను ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఎలక్షన్ ఆఫీసర్లుగా జిల్లా జగన్మోహన్ రావు వనమా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశీలకులుగా నరసింహ మూర్తి , నూకల శ్రీనివాస్ వ్యవహరించారు .

## ఆత్మ గౌరవాన్ని పెంపొందించిన సర్వాయి పాపన్న

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్ రెడ్డి (బాజీ పటేల్)
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న పులి ఇంద్రకరణ్ రెడ్డి



**కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా జూలై 1 అక్షరం న్యూస్:** లంగాణ ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని మొట్లపల్లి గ్రామంలో చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం కోసం భూమి పూజ చేశారు. అనంతరం సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు స్వయంగా విరాళం ఇవ్వనున్నట్లు తెలియపరిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం సర్వాయి పాపన్న పోరాడాలని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులా మనోహర్రావు, గౌడ సంఘం నాయకులు గోపగోని శ్రీకాంత్, మూల తిరుపతి గౌడ్, గాజర్ల రాజకుమార్ గౌడ్, బుర్ర చిరంజీవి గౌడ్, ఒల్లాల రవీందర్ గౌడ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు






**జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 1 :** నూతన లయన్ డే సంవత్సరాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. జూలై 1 లయన్ స్టిక్ మొదటి రోజు సందర్భంగా వారు పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా దుర్గమ్మ గుడి ప్రాంగణంలో మొక్కలను నాటడం అదేవిధంగా జూలై 1 డాక్టర్స్ డే సందర్భంగా పలువురు వైద్యులకు సన్మానం చేశారు,320%ట% జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి సూచనల మేరకు జూలై 1న లయన్స్ క్లబ్ ప్రారంభ సంవత్సరంలో మొదటి రోజున పురస్కరించుకొని క్లబ్ అధ్యక్షులు కందుల అనిల్ కుమార్ పలు కార్యక్రమాలను వివిధ సభ్యుల సహకారంతో చేపట్టారు,ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు లయన్ కందుల అనిల్ కుమార్ మాట్లాడుతూ వైద్యులు సేవలు చాలా ప్రశంసనీయమైనవని వారి సేవలను గుర్తిస్తూ డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా నిర్వహించి పలువురు డాక్టర్లను సన్మానించారు,అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో మొక్కలు చాలా ప్రముఖ పాత్ర వహిస్తాయని అందుకోసమే మొక్కల నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టడం జరిగిందనితెలిపారు,ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్ లయన్ కూరెళ్ళ ఉపేందర్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. .ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు శంకర్ రెడ్డి, అలాగే లక్ష్మీనారాయణ, క్లబ్ కోశాధికారి కోళ్ల రాజు, వాయినాల సురేష్,రహీం పాషా, ఇమ్మడిశెట్టి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



**జ్యోతి నగర్ జూలై 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:** ఎన్టిపిసి పెర్మనెంట్ కౌన్సిల్ కాలనీలో గల శివాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ వేద పండితులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉద యం శివాలయంలో గణపతి హెూ మం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు అనంతరం ఉమామహేశ్వర కళ్యాణ మహెూత్సవాన్ని ఆల య వేద పండితులు రాంపల్లి వామన శర్మ రుద్రపట్ల శ్రీకాంత్ శర్మ మారుపాక శ్రీకాంత్ శర్మ, శ్రీహరి శర్మతో పాటు చంద్రశేఖర్ గిరి కుమార్ పాల్గొన్నారు.